చేరువైన సేవలు

ఈ ఫొటోలో మంచంమీద పడుకుని లేవలేని స్థితిలో ఉన్న బాలిక పేరు కూతాడి నాగబసవపూర్ణ. ఊరు అవనిగడ్డ మండలం బందలాయిచెరువు. వికలాంగ పింఛన్ తీసుకుంటోంది. గతంలో పింఛన్ తీసుకోవాలంటే భార్య, భర్తలిద్దరూ పనిమానుకుని, ప్రత్యేకంగా రిక్షా కట్టించుకుని పంచాయతీకో, పోస్టాఫీసుకో వెళ్లాల్సి వచ్చేది. గంటల తరబడి పడిగాపులు పడటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇంటి కొచ్చే సరికి ఈ పాప నీరసించి పోయేది. నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ ఇంటికొచ్చి పింఛన్ ఇచ్చి వెళుతుండటంతో ఆ ఇబ్బందులన్నీ తొలగిపోయాయి.



- సచివాలయాల ఏర్పాటు, వలంటీర్ వ్యవస్థతో పెను మార్పులు
- నాడు పింఛన్ కోసం పడిగాపులు
- నేడు ఇంటికొచ్చి ఇస్తున్న వలంటీర్లు
- అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు గడప వద్దకే



గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం అవనిగడ్డ పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న పింఛను లబ్ధిదారులు (ఫైల్)



బందలాయిచెరువులో దివ్యాంగ బాలికకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

అవనిగడ్డ: 2015 డిసెంబర్ 2వ తేదీన చల్లపల్లి మండలం లక్ష్మీపురం పోస్టాఫీస్‌కు పింఛన్ తీసుకునేందుకు వెళ్లిన జంగాల నాగమల్లేశ్వరమ్మ నాలుగు గంటల పాటు పడిగాపులు పడి సొమ్మసిల్లి పడిపోయి చనిపోయింది. నాడు పింఛన్ తీసుకోవడానికి పడిన ఇబ్బందులకు ఇదొక మచ్చుతునకని చెప్పవచ్చు. నేడు ప్రతి నెలా ఒకటో తేదీనే తెల్లవారక ముందే లబ్ధిదారుల ఇంటికొచ్చి వలంటీర్లు పింఛన్లు ఇచ్చి వెళుతున్నారు. ఒకప్పుడు కుల, ఆదాయ, జనన, మరణ, ఇతర సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయాలు, పంచాయతీల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారు. నేడు సర్టిఫికెట్లు ఇళ్లకే తీసుకొచ్చి ఇస్తున్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గతంలో ఉన్న ఇబ్బందులన్నీ తొలగిపోయాయి.

నాడు పింఛన్ కోసం వెళ్లి ప్రాణాలొదిలేవారు..

గతంలో పింఛన్లు తీసుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పంచాయతీ కార్యాలయాల వద్ద ఇచ్చే పింఛన్ కోసం ముందురోజు రాత్రే అక్కడకు వెళ్లి పడిగాపులు పడేవారు. వేలిముద్రలు వేయించుకునేందుకు సిగ్నల్ లేక పోవడం, వేలిముద్రలు పడక పోవడంతో రోజంతా పడిగాపులు పడాల్సి వచ్చేది. ఒకటో తేదీన మొదలు పెడితే ఏడెనిమిది తేదీల వరకూ పింఛన్లు ఇస్తూనే ఉండేవారు. పోస్టాఫీసుకు మార్చిన తరువాత కూడా పింఛన్లు తీసుకునేందుకు పడిగాపులు ఇంకా ఎక్కువయ్యాయి. పింఛన్ కోసం వెళ్లి పడిగాపులకు సొమ్మసిల్లి పడిపోయి చనిపోయిన వారు ఉన్నారు. అర్ధరాత్రిళ్లు పింఛన్ల కోసం పడిగాపులు పడేవారు. నేడు తెల్లవారు జామునే వలంటీర్లు ఇంటికొచ్చి తలుపుతట్టి పింఛన్ ఇచ్చి వెళుతున్నారు. కొంతమంది పింఛన్‌దారులు వలంటీర్లను తమ కొడుకుల కంటే ఎక్కువగా చూసుకుంటున్నారు.

పింఛన్లు, పథకాల దరఖాస్తుకు నాడు పడిగాపులు..

గతంలో కొత్తగా ఎవరన్నా పింఛన్ కోసం దరఖాస్తు పెట్టుకోవాలన్నా, నివేశన స్థలం, గృహ నిర్మాణం, ఇతర సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే సంబంధిత కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగేవారు. నేడు అర్హత ఉంటే వలంటీర్లే దరఖాస్తులు తీసుకెళ్లి పింఛన్లు, పథకాలు వచ్చేలా చూస్తున్నారు.

సర్టిఫికెట్లు ఇంటికే..

గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగేవారు. పనులు మానుకుని వారం పది రోజులు తిరిగినా సర్టిఫికెట్లు వచ్చేవి కావు. దీంతో సకాలంలో సర్టిఫికెట్లు రాక జాబ్‌లు మిస్సయినవారు ఉన్నారు. దరఖాస్తు ఫారం తీసుకొచ్చే దగ్గర నుంచి పూర్తి చేయడం, సర్టిఫికెట్ వచ్చే వరకూ వలంటీరే చూసుకుంటున్నారు. సర్టిఫికెట్స్ వచ్చాక ఇంటికి తీసుకొచ్చి ఇస్తున్నారు.

పెరిగిన పింఛన్లు..

గత టీడీపీ హయాంలో అవనిగడ్డ మండలంలో మొత్తం 6,242 మంది పింఛన్ దారులుండేవారు. వీరిలో వృద్ధాప్య పింఛన్ దారులు 4,812మంది ఉండగా, వితంతు పింఛన్లు 1,080, వికలాంగ పింఛన్లు 350 మంది ఉండేవారు. నేడు 7,679 మందికి పెరిగారు. గతంలో కంటే 1,438 మందికి అదనంగా పింఛన్లు ఇస్తున్నారు. ప్రస్తుతం వృద్ధాప్య పింఛన్‌దారులు 5,808 మంది ఉండగా, వితంతు 1,235, వికలాంగులు 637 మంది ఉన్నారు. గతంలో పింఛన్ల పంపిణీకి వారం రోజులు సమయం పట్టేది. నేడు తొలి రోజే 90 శాతానికి పైగా పింఛన్లు పంపిణీ చేస్తున్నారు.

సీఎం జగన్ రుణం తీర్చుకోలేనిది



గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలంటే తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగేవాళ్లం. పనులు మానుకుని తిరగడం వల్ల కూలీ పోయేది. తిరిగేందుకు ఖర్చులు అయ్యేవి. ఇప్పుడు వలంటీర్‌కు చెబితే చాలు. అన్నీ వాళ్లే చూసుకుని సర్టిఫికెట్ తీసుకొచ్చి ఇచ్చి వెళుతున్నారు. ఇలాంటి బృహత్తర వ్యవస్థను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏమిచ్చినా రుణం తీర్చుకోలేం.

– కమ్మిలి శ్రీను, బందలాయిచెరువు, అవనిగడ్డ మండలం

సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం జగన్



మాకు ఇచ్చిన 50 కుటుంబాల పరిధిలో ఏడుగురికి వికలాంగ పింఛన్లు ఇస్తున్నా. వీరిలో ఒకరు నడవలేరు. నలుగురు పింఛన్ దారులు అడుగు తీసి అడుగు వేయడానికి తీవ్ర ఇబ్బందులు పడతారు. ఇళ్లకు వెళ్లి వారికి పింఛన్ అందిస్తున్నప్పుడు వారి ముఖంలో కనబడే చిరునవ్వుకు వెల కట్టలేం. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటా.

– నాగినేని నాగమణి, వలంటీర్, బందలాయిచెరువు

క్లుప్తంగా

ప్రశాంతంగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు



మచిలీపట్నంటౌన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని ఏడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు మొత్తం 801 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 550 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 251 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను డీవైఈఓ యూవీ సుబ్బారావు పరిశీలించారు.

విద్యతోనే అభివృద్ధి, గౌరవ మర్యాదలు



మచిలీపట్నంటౌన్: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, విద్యావంతులకు సమాజంలో గౌరవ మర్యాదలు ఉంటాయని ఆదివెలమ శ్రేయోభివర్ధిని సంఘం అధ్యక్షుడు పిల్లారిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బలరామునిపేటలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను, జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఉన్నత చదువులు చదవడం ద్వారానే మంచి ఉద్యోగం పొందటంతో పాటు సమాజంలో గౌరవం పొందగలుగుతారన్నారు. చదువు లేకుంటే జీవిత లక్ష్యాలను సాధించలేమన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మాదిరెడ్డి ఆంజనేయులు, హరినాథ్, బాబ్జీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకం అనర్థం




చల్లపల్లి: పర్యావరణానికి పెను నష్టం కలిగిస్తున్న సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువులు వినియోగించవద్దని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం సాయంత్రం మిషన్ లైఫ్ 2023 కార్యక్రమంలో భాగంగా డీపీఓ ఆదేశాల మేరకు గుడివాడ కళాభారతి బిళ్లపాడు కళాకారుల బృందం వారు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ అనర్థాలను కళాకారులు ప్రదర్శన ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బూరేపల్లి అశోక్, పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి), పంచాయతీ ఈఓ పడమట సుకుమార్, గ్రామ సచివాలయ మహిళా పోలీస్ వేమూరి లావణ్య, కళాకారులు శేఖర్ బాబు, దేవ ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభం



పురిటిగడ్డ(చల్లపల్లి): పురిటిగడ్డ పంచాయతీ శివారు నిమ్మగడ్డ ఎస్సీ కాలనీలో రోడ్డు అభివృద్ధి పనులను జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి శుక్రవారం ప్రారంభించారు. జెడ్పీటీసీ కల్యాణి ప్రతిపాదన మేరకు ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక నిధులు మంజూరు చేసిన రూ.6 లక్షలతో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాజులపాటి శివప్రసాద్, పురిటిగడ్డ సర్పంచ్ మాతంగి రమ్య, వైఎస్సార్ సీపీ నాయకులు గోవాడ మోహనరావు, విజయకుమారి, భద్రి, వీరబాబు, పఠాన్ పాల్గొన్నారు.

95.12 శాతం పింఛన్ల పంపిణీ



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ రెండో రోజైన శుక్రవారం 95.12 శాతం పూర్తి చేశారు. నగరంలో 18,515 పింఛన్లు ఉండగా శుక్రవారం సాయంత్రం ఏడు గంటల వరకు 17,611 పింఛన్లను పంపిణీ చేశారు. ఇంకా 904 పింఛన్లు పంపిణీ చేస్తే నూరు శాతం పింఛన్ల పంపిణీ పూర్తవుతుంది.

గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించండి

మచిలీపట్నం ఆర్డీఓ కిషోర్



గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న ఆర్డీఓ కిషోర్

పెడన: గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి వెంటనే నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మచిలీపట్నం ఆర్డీఓ ఐ. కిషోర్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో పెడన పట్టణంతో పాటు మండలంలోని సచివాలయాల ఇంజినీరింగ్ సిబ్బందితో పాటు గృహ నిర్మాణ శాఖాధికారులు, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సచివాలయాల వారీగా ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. ఆర్డీఓ మాట్లాడుతూ లబ్ధిదారులు ఇంకా గృహ నిర్మాణాలు చేపట్టకపోతే మీరు ఏమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ఎందుకు ముందుకు రావడం లేదో తెలుసుకోవాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టని వారి జాబితాలను తయారు చేసి వారి నుంచి లిఖిత పూర్వకంగా ఇంటిని నిర్మించుకోలేమనే విషయాన్ని లెటర్ రూపంలో తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇళ్లు నిర్మించుకుంటామని ముందుకు వచ్చే వారికి స్థలాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పెడన తహసీల్దార్ పి. మధుసూదనరావు, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, హౌసింగ్ డీఈ ఎ. శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్రవంతి, హౌసింగ్ ఏఈలు రామచంద్రన్, మాధవి, వెలుగు ఏపీఎం శ్రీదేవి, మెప్మా టీఎంసీ భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధులు వలంటీర్లు



13వ డివిజన్‌కు చెందిన సేవా మిత్ర అవార్డు పొందిన వలంటీర్లను సత్కరించిన పేర్ని కిట్టు, మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ తదితరులు

మచిలీపట్నంటౌన్: ప్రజలకు, ప్రభుత్వానికి వలంటీర్లు వారధులుగా నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని 50 డివిజన్లకు సంబంధించి 712 మంది వలంటీర్లకు అవార్డులు అందజేశారు. వీరిలో ఇద్దరు సేవా వజ్ర, ఏడుగురు సేవా రత్న, 703 మంది సేవామిత్ర అవార్డులకు ఎంపిక కాగా వారిని ప్రత్యేకంగా సన్మానించారు. అనంతరం జరిగిన సభలో పేర్ని కిట్టు మాట్లాడుతూ ప్రజల తరువాత వలంటీర్లకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రతి ఒక్క వలంటీర్ ప్రజల మనసును చూరగొనేలా స్వచ్ఛందంగా సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు పార్టీలతో సంబంధం లేకుండా మీ ద్వారానే అన్నివర్గాల ప్రజలకు అందుతున్నాయన్నారు. మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు నిస్వార్థంగా చేరవేయడంలో వలంటీర్లు కృతకృత్యులయ్యారన్నారు.

పేర్ని కిట్టు

అవార్డులు పొందిన వలంటీర్లు వీరే..

నగరంలోని ఐదో డివిజన్‌కు చెందిన చొప్పిడి ప్రవీణ్, 23వ డివిజన్‌కు చెందిన బొమ్మిడి రవి సేవా వజ్ర అవార్డులకు ఎంపికయ్యారు. వీరికి రూ. 30 వేలు నగదు, ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారు. మూడో డివిజన్‌కు చెందిన వై. చిద్విలాస్, ఐదో డివిజన్‌కు చెందిన వై. అనిల్‌బాబు, ఎనిమిదో డివిజన్‌కు చెందిన వి. నాగజ్యోతి, అబ్దుల్ రహమాన్ చిస్తియా, 19వ డివిజన్‌కు చెందిన అర్జా దుర్గాఫణీంద్ర, 22వ డివిజన్‌కు చెందిన పి. ప్రియాంక, 23వ డివిజన్‌కు చెందిన లంకే రంగారావులు సేవారత్న అవార్డులు పొందారు. వీరికి రూ. 20 వేల నగదుతో పాటు ప్రశంసాపత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. సేవామిత్ర అవార్డులకు 703 మంది ఎంపిక కాగా వారికి రూ. 10 వేలు ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారు. కమిషనర్ జి. చంద్రయ్య, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, అర్బన్ బ్యాంక్ చైర్మన్ వల్లపోతు సుబ్రహ్మణ్యం, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, డీఎల్‌డీఓ జి. పద్మ, కార్పొరేటర్లు, పార్టీ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

10న నాగపట్నానికి ప్రత్యేక బస్ సర్వీస్

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 10వ తేదీన వేళాంగిణి (నాగపట్నం)కు ప్రత్యేక బస్సు నడపనున్నట్లు డీఎం పి.శివాజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు గన్నవరం బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. 11వ తేదీ ఉదయం నాగపట్నం చేరుకుని వేళాంగిణి మాత దర్శనం, దివ్యబలిపూజ తర్వాత రాత్రి అక్కడే బస ఉంటుందని తెలిపారు. తిరిగి 12వ తేదీ ఉదయం నాగపట్నం నుంచి బయలుదేరి మధ్యాహ్నం చెన్నైకు చేరుకుని సెయింట్ థామస్ సమాధి సందర్శన, అదే రోజు మెరీనా బీచ్ సందర్శన తర్వాత రాత్రికి బయలుదేరి 13వ తేదీ ఉదయం 10 గంటలకు గన్నవరం చేరుకుంటుందని వివరించారు. యాత్ర టికెట్ ధర రూ. 3,400లుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇతర వివరాలకు సెల్: 87909 96090, 73829 05633 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇనాం భూముల సాగుదారుల సమస్యలు పరిష్కరిస్తాం

గుడివాడ ఆర్డీఓ పద్మావతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: వెంకటాపురం ఇనాం భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని గుడివాడ ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. బాపులపాడు మండలం సిరివాడలో వెంకటాపురం ఇనాం భూముల సాగుదారులతో రెవెన్యూ అధికారులు శుక్రవారం సదస్సు నిర్వహించారు. దీర్ఘకాలంగా ఇనాం భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఈ భూములు సాగు చేస్తున్న పేద రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని ఆర్డీఓ పద్మావతికి విజ్ఞప్తి చేశారు. బాపులపాడు తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవానీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ తదితరులు పాల్గొన్నారు.

5న మడ మొక్కల పెంపకం ప్రారంభం

మచిలీపట్నంటౌన్: అటవీ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని గిలకలదిండి సముద్రతీర ప్రాంతంలో తీరప్రాంత నివాసాలు, ప్రత్యక్ష ఆదాయాల కోసం మడ అడవుల ఏర్పాటు (మిస్టీ) కార్యక్రమంలో భాగంగా మడ మొక్కలు నాటే కార్యక్రమం ఈ నెల 5వ తేదీన ప్రారంభిస్తామని జిల్లా అటవీ శాఖాధికారి కె. రాజశేఖరరావు శుక్రవారం తెలిపారు. తన కార్యాలయంలో విలేకర్లతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈనెల ఐదో తేదీ ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమానికి కలెక్టర్ పి. రాజాబాబు, బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, నాయకులు, అధికారులు పాల్గొంటారన్నారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మిస్టీ కార్యక్రమంలో భాగంగా ఐదు హెక్టార్లలో మడ మొక్కల పెంపకం కార్యక్రమం చేపడతామన్నారు. మచిలీపట్నం, కానూరు ప్రాంతంలో మడ అడవి ఉందని, అక్కడక్కడా ఖాళీ స్థలాలు ఉన్నాయని, ఈ స్థలాల్లో కూడా మడ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామని చెప్పారు. గ్రీన్ క్లయిమెట్ ఫండ్ (జీసీఎఫ్) నిధులతో పలు ప్రాంతాల్లో మొక్కలు నాటామని, రానున్న రోజుల్లో ఈ మొక్కలను నాటే కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

నేడు రామాలయం పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

తలగడదీవి(నాగాయలంక): గ్రామంలోని పురాతనమైన కోదండ రామాలయం పునర్నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన జరుగుతుందని ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు, కోశాధికారి చిట్టా శివనాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 150 సంవత్సరాల నాటి ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తుల సహకారంతో పునర్నిర్మాణం చేపట్టామన్నారు. శనివారం ఉదయం 8.30 గంటలకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మచిలీపట్నంటౌన్: స్థానిక బుట్టాయిపేటలోని జ్యోతిరావు పూలే విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జీబీఆర్ ఫౌండేషన్, ప్రజా ఆరోగ్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని శిబిర కన్వీనర్ పామర్తి నాగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు జరిగే శిబిరంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాలం శివన్నారాయణ పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వైద్యులు కుప్పా రామశాస్త్రి, పి. సురేష్, చంద్రారెడ్డి, రావి శ్రీనివాసరావు, డీఆర్కే ప్రసాద్, పి. పద్మావతి, శంకరానంద్‌లు పాల్గొని వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. శిబిరంలో బీపీ, షుగర్, మూర్ఛ, పక్షవాతం తదితర వ్యాధులకు సంబంధించి వైద్యసేవలు అందిస్తారన్నారు. రెండు నెలలకు సరిపడా మందులు రూ. 200లకు అందజేస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని మచిలీపట్నం పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాగయ్య కోరారు.

కమనీయం.. వెంకన్న కౌతుకోత్సవం



కౌతుకోత్సవం నిర్వహిస్తున్న పండితులు, ఉభయ దాతలు

కోడూరు: కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కౌతుకోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ యాగశాలలో ప్రత్యేక హోమాలు చేశారు. కోడూరుకు చెందిన వెంకట రామకృష్ణప్రసాద్ (చిన్ని), రేపల్లెకు చెందిన మురళీకృష్ణ–ప్రియాంక దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి కౌతుకోత్సవాన్ని జరిపారు. నవకలశ స్నపన ఉత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కలశాలను ఆలయం చుట్టూ ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక జలాలలో స్వామివార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. మూలమూర్తులకు చేసిన అలంకారం ఆకట్టుకుంది. గురువారం రాత్రి వంతెన సెంటర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద స్వామి వారి రాయబారోత్సవం నిర్వహించారు. ఉపన్యాస వాచస్పతి మొవ్వ వృషాద్రిపతి వ్యాఖ్యాతగా వ్యవహరించి స్వామి, అమ్మవార్ల గుణగణాలను భక్తులకు వివరించారు. బ్రహ్మోత్సవాల్లోని ప్రధాన ఘట్టాలను అనుగ్రహభాషణం చేశారు. శుక్రవారం రాత్రికి జరగవల్సిన కల్యాణాన్ని అనివార్య కారణాల వల్ల శనివారం రాత్రికి నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

కనుల పండువగా స్వామి వారి కల్యాణం

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్‌పేటలోని రంగనాయకస్వామి, రామలింగేశ్వరస్వామి వార్ల కల్యాణం శుక్రవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. స్వామివార్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి తిలకించారు. తమ్మన సోమశేఖర పవన్‌కుమార్, కృష్ణవేణి, గమిడి సునీల్‌కుమార్, హారిక దంపతులు పీటలపై కూర్చున్నారు. సామా కుమారి భక్తబృందం ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు. అలాగే పర్వత వర్ధిని, రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవంలో దేసు వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, నీరజ, కోట నాగవెంకట జయరాం, శ్రీదుర్గ దంపతులు పీటలపై కూర్చున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఆంజనేయ స్వామి పర్యవేక్షించారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు



కోలాటం ఆడుతున్న చిన్నారులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈడేపల్లి శాఖా గ్రంథాలయంలో డ్రాయింగ్ మాస్టర్ శేషగిరిరావు విద్యార్థులకు చిత్రలేఖనం నేర్పించారు. లక్ష్మీకాంతం విద్యార్థులకు దక్షిణామూర్తి దత్తస్తవం శ్లోకాలు నేర్పించారు. ఉపాధ్యాయిని వనజ పేపర్ క్రాఫ్ట్ బొమ్మల తయారీ నేర్పించారు. నాగమణి కోలాటం నేర్పారు. అలాగే క్యారమ్స్, చెస్, లూడో వంటి ఆటలు ఆడించారు. యోగా మాస్టర్ సత్యనారాయణ యోగా, ధ్యానం చేయించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం, చిలకలపూడి గ్రంథాలయాల్లో కూడా పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాలను జిల్లా ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్, ఈడేపల్లి, చిలకలపూడి శాఖ గ్రంథాలయాల అధికారులు పర్యవేక్షించారు.

రక్త సేకరణలో జాగ్రత్తలు పాటించాలి



స్టాఫ్ నర్సులతో కళాశాల డీజీ డాక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రంగారావు తదితరులు

గన్నవరం రూరల్: దాతల నుంచి రక్తం సేకరించేటప్పుడు డ్రగ్ అండ్ కాస్మెటిక్ చట్టం ప్రకారం అన్ని జాగ్రత్తలు పాటించాలని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.నాగేశ్వరరావు చెప్పారు. కళాశాలలో ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ(ఏపీసాక్స్) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరుగుతున్న రాష్ట్ర స్థాయి ప్రభుత్వ బ్లడ్ సెంటర్ల స్టాఫ్ నర్సుల అవగాహన సదస్సు లో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 43 ప్రభుత్వ సెంటర్ల స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బ్లడ్ ఎక్కించే ముందు ఇన్ఫెక్షన్లు పరిశీలించుకోవాలని చెప్పారు. ఏపీ సాక్స్ జేడీ డాక్టర్ కిషోర్ పర్యవేక్షణలో జరుగుతున్న కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు, హెచ్‌ఓడీ డాక్టర్ నవీన్ చంద్రరావు, ప్రొఫెసర్ కల్యాణ్ చక్రవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు జాస్మిన్ సుల్తానా, ప్రణీత్ పాల్గొన్నారు.

[illegible]
... కంచర్లపల్లి దేవేంద్ర ప్రసాద్ ... సెల్: 9849797226

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543, 79950 92116 (మచిలీపట్నం, పెడన)
99122 20545 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com